# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 17, మే 2026






# భానుడి భగభగ..


## మండుతున్న మే..

## ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు..

మందమర్రి, మే 16, ప్రభాతవార్త

*మండుతున్న ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరగడంతో ఉదయం 10 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం వేళ బయటకు రావడానికి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. తీవ్ర వడగాల్పులతో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు మధ్యాహ్న సమయంలో వెలవెలబోతున్నాయి. వైద్యులు అత్యవసరమైతే తప్ప ఎండలో బయటకు రావద్దని సూచిస్తున్నారు.*







2లో..



ఫారెస్ట్ ఉద్యోగాల

## మాయజాలం..

- రూ.15 లక్షలు దోచిన ముఠా
- నకిలీ నియామక పత్రాల తయారీ బట్టబయలు
- ముగ్గురు అరెస్ట్..

చింతలమానేపల్లి, మే 16, ప్రభాతవార్త:

అటవీ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి యువకుల నుంచి రూ.15 లక్షలకు పైగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఎస్ ఐ జీవన్ తెలిపిన వివరాల ప్రకారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన గౌత్రే మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగజ్‌నగర్ మండలం గువ్వల గూడెంకు చెందిన బురుస రంగయ్య గతంలో అటవీ శాఖలో వాచర్‌గా పనిచేసి ఉద్యోగం మానేశాడు. అతనికి డబ్బా గ్రామానికి చెందిన దూలం చిలుక బంధువు. వీరిద్దరూ కలిసి గౌత్రే మోహన్ అతని బంధువైన సోదరీ సందీప్‌కు ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌లో ఎఫ్ బి ఓ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. 2019 నుంచి 2024 వరకు పలు దఫాలుగా మిగతా 2లో..


# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

*** రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

నిర్మల్, మే 16, ప్రభాతవార్త:

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ అమలు విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టబోయే ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఫారాల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను మిగతా 2లో..





# జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హెల్ప్‌డెస్క్ ప్రారంభం

*** మెంబర్షిప్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ కె. హరిత**

కాగజ్‌నగర్ రూరల్, మే 16, ప్రభాతవార్త :

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఐఆర్‌సీఎస్ అధ్యక్షురాలు కె. హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు (మెంబర్షిప్ డ్రైవ్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం మిగతా 2లో..

# భానుడి భగభగ..

(మొదటిపేజీ తరువాయి)

### భానుడి ప్రతాపం.. రోజువారీ కూలీలకు జీవన పోరాటం

భానుడి భగభగలతో రోజువారీ కూలి పనులు చేసుకునే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుతున్న ఎండల్లో పని చేయలేక పలువురు కూలీలు మధ్యాహ్నం పనులు నిలిపివేస్తున్నారు. "పని చేయకపోతే కుటుంబ పోషణ కష్టం.. పని చేస్తే ఎండ తట్టుకోవడం కష్టం" అంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ రంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాటసారుల కొరకు పలు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించి మానవత్వం చాటుకున్నా రు.

### సింగరేణి ఉపరితల గనుల్లో ఎండ సెగ.. కార్మికులకు తప్పని తిప్పలు

తీవ్ర ఎండలు సింగరేణి ఉపరితల గనుల కార్మికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు మండుతున్న ఎండల్లో విధులు నిర్వర్తించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో గనుల్లో పనిచేసే కార్మికులు అలసట, నీరసం, వడదెబ్బ లక్షణాలతో బాధపడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో పని చేయడం కష్టసాధ్యంగా మారిందని కార్మికులు చెబుతున్నారు. తగినంత తాగునీరు, విశ్రాంతి సమయం, షెడ్ల లో విశ్రాంతి తీసుకోవాలి వైద్యులు సూచించారు.

### వడగాల్పుల హెచ్చరిక..

### అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. తరచూ నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బయటకు రాకపోవడం మంచిదని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెచ్చరిస్తున్నారు.

# కాగజ్‌నగర్ మండలానికి మూడు కొత్త 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు

**- ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు**

కాగజ్‌నగర్ రూరల్, మే 16, ప్రభాతవార్త :



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ మండలంలో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కొత్తగా మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేసినట్లు సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, 31 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండల ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మూడు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. మండలంలోని అంకుసాపూర్, బోడేపల్లి గ్రామాలతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ప్రాంతంలో కొత్త 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్లు పూర్తయిన అనంతరం గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు రైతులు, గృహ వినియోగదారులు, చిన్న వ్యాపారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వం త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు తమ గ్రామాల ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లెపూల మధుకర్, ఎంపీడీవో సిహెచ్ ఉజ్వల్ కుమార్, సర్పంచులు బికాస్ గారామి, వేణు యాదవ్, అగ్గిళ్ల సంగీతశ్రీనివాస్, రాజేందర్ జాదవ్, నాయకులు పుల్ల అశోక్, పిర్సింగుల తిరుపతి, లోనారే రవీందర్, కొప్పుల సుధాకర్, దోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

**- గిరిజన సంక్షేమ ఏసీఎంఓ ఉద్ధవ్**

వాంకిడి, మే 16, ప్రభాతవార్త:



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వాంకిడి మండలంలోని పిప్పర్ గొంది మరియు సడక్ గూడ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ ఆసిఫాబాద్ ఏసీఎంఓ ఉద్ధవ్ హాజరై మాట్లాడారు.బడి ఈడు పిల్లలను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో తప్పనిసరిగా చేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.గిరిజన విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలలు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, ప్రీ మెట్రిక్ మరియు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, మౌలిక సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు.ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను పాఠశాలకు పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాడుగుల నారాయణమూర్తి, వాంకిడి ఎస్సీఆర్‌పీ వై. రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు కె. మనోహర్, దేవయ్య, రవి, స్థానిక ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హెల్ప్‌డెస్క్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ సేవలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కీలక పాత్ర పోషిస్తోందని, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అదే విధంగా కలెక్టర్ కె. హరిత స్వయంగా ఐఆర్‌సీఎస్ ప్యాట్రన్ సభ్యురాలిగా సభ్యత్వం స్వీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సహాయ కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు అందించడంలో రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యువరాజ్, జిల్లా అధికారులు, ఐఆర్‌సీఎస్ కమిటీ సభ్యులు ,జిల్లా ఐఆర్‌సీఎస్ నోడల్ అధికారి కిరణ్ కుమార్, పూర్వ జిల్లా కన్వీనర్, ప్యాట్రన్ సభ్యులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, ప్యాట్రన్ సభ్యులు డా. కొత్తపల్లి అనిత, వెంకటరమణ రెడ్డి, రతన్ గైన్ ,జిల్లా అధికారులు, ఐఆర్‌సీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ ఉద్యోగాల మాయజాలం..

(మొదటిపేజీ తరువాయి)

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మొత్తం రూ.15,80,600 వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్‌కు చెందిన బాలాజీ టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మార్త రాకేష్ సహాయంతో నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు తయారు చేసి, నకిలీ సంతకాలు చేసి బాధితులకు చూపించినట్లు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం నిందితులైన బురుస రంగయ్య, దూలం చిలుక, మార్త రాకేష్‌లను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండా, పరీక్షలు రాయకుండా ప్రభుత్వ ఉద్యోగాలు రావని పోలీసులు స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మి మోసపోవద్దని యువతకు సూచించారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలనలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్పష్టత కల్పిస్తామని తెలిపారు. ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యం

**- చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ వెల్లడి**

**- చెన్నూరులో పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్**

**- సరైన పత్రాలు లేని 65 ద్విచక్రవాహనాలు, 5 ఆటోలు సీజ్**

చెన్నూరు, మే 16, ప్రభాతవార్త



ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ అరికట్టవచ్చని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ అన్నారు. జిల్లాలోని స్థానిక చెన్నూరు పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో కొత్తగూడెం కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంట్లో తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 65 బైకులు, 5 ఆటోలను సీజ్ చేసి జరిమానాలు విధించారు. గుడుంబా విక్రయాలపై ఆరా తీసి, అనుమానితుల ఇళ్లలో ప్రత్యేక బలగాలతో తనిఖీలు చేపట్టారు. కాలనీలో కొత్తగా నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కాలనీలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు, అపరిచితులు ఆశ్రయం పొందుతున్నట్లు అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నుంచి జాగ్రత్త పడాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాలనీ భద్రత కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేర నియంత్రణకు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

**సిర్పూర్ ఎమ్మెల్యే డా.హరీష్‌బాబు**

**సిర్పూర్(టి), మే 16, ప్రభాతవార్త :**

2వ తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభం కానుందని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 47 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు తమ తమ ఎంపీడీవో కార్యాలయాల్లో వెంటనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట గ్రామంలో కొత్తగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో చింతకుంట, చుంచుపల్లి, హీరాపూర్, భూపాలపట్నం, కేశవపట్నం, ఆచెల్లి తదితర గ్రామాల్లో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి పంపులు సక్రమంగా పనిచేయడంతో పాటు గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ఐ స్వప్న, ప్రవీణ్, సర్పంచులు నాగమణి, రజిని, వడాయి తాను భాయ్, ఉపసర్పంచులు దుర్గం ప్రశాంత్, శేఖర్, నాయకులు నానయ్య, మహేష్, బనర్కర్ సాయి, ఎలుములే శంకర్, శ్రీనివాస్ గౌడ్, బాపు, రవి, సంతోష్, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణి చేస్తున్న ప్రజా ప్రతినిధులు



## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

**చెన్నూరు, మే 16 ప్రభాతవార్త**

చెన్నూరులో ధాన్యం కొనుగోలు నత్త నడకన సాగుతున్నాయని, రైతులు మూడు రోజుల నుండి చెన్నూరు మార్కెట్ యార్డ్ వద్ద ధాన్యం ట్రాక్టర్లతో ఎండలో పడిగాపులు కాస్తుంటే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని చెన్నూరు భాజపా కౌన్సిలర్ ఏతం శివకృష్ణ మండిపడ్డారు. శనివారం చెన్నూరు గిడ్డంగుల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ రైతులు నారు పోయడం మొదలుకొని పంట తీసి అమ్ముకునే వరకు వారి కష్టాలు చెప్పలేనివని అన్నారు. రైతును రాజును చేసి బంగారు కుర్చీ వేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పంటను అమ్ముకోవడానికి వస్తే కనీస వసతులు లేక మూడు రోజులుగా ఎండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఇకనైనా రైతులు పడే కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



అసిఫ్ ఖాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

## కాంగ్రెస్ అధ్యక్షుడిగా అసిఫ్ ఖాన్

**ఇచ్చోడ, మే 16, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన అసిఫ్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒకే వేదికపైకి వచ్చి అసిఫ్ ఖాన్‌పై పార్టీ అధిష్ఠానం ఉంచిన నమ్మకాన్ని స్వాగతించారు. ఆయన నాయకత్వంలో ఇచ్చోడ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుంరం కోటేష్, ఆడేగామ సర్పంచ్, పోతారెడ్డి, శివాజీ, లతీఫ్, షఫీ భాయ్, బాబా, ఖుద్దూస్, మాజీ సర్పంచ్ రాథోడ్ దుదారం, భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ నౌషాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**ఆసిఫాబాద్ టౌన్, మే 16, ప్రభాతవార్త :**

ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో సాధారణ ప్రజలు, ప్రయాణికులు, కూలీల దాహార్తిని తీర్చడం కోసం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో సంత కావడంతో జిల్లా లోని నాలువైపుల నుంచి వచ్చే ప్రజల సౌక్యాయ్యార్థం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, మాజీ జడ్పి చైర్మన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి తనయుడు కోవ సాయినాథ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ , వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




అంబలి పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ షబానా తరన్నం

## విద్యార్థులకు కృత్రిమ మేధస్సు అవసరం ఎంతైనా ఉంది

**నేరడిగొండ, మే 16, ప్రభాతవార్త**

నవీన ప్రపంచంలో ప్రతి విద్యార్థికి కృత్రిమ మేధస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీని గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షబానా తరన్నం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఆరవ రోజు ఉత్సవాల్లో భాగంగా శనివారం కళాశాలలో విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి, దాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే అనువైన మార్గాలలో ఏఐని ఉపయోగించుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యాపరంగా, ఉద్యోగాల పరంగా, నిత్యజీవితంలో అన్ని విధాలుగా దీనిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మనుషుల లాగే ఆలోచించడం, నేర్చుకోవడం, తార్కికం చేయడం, నిర్ణయాలు తీసుకోవడం వంటి పనులను యంత్రాలు, కంప్యూటర్లు చేయడమే కృత్రిమ మేధస్సు అని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మమత, ప్రవీణ్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ఆసిఫాబాద్, మే 16, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఉదయం వాహన తనిఖీలలో భాగంగా చిర్రకుంట ఎక్స్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక రవాణాకు సంబంధించిన సరైన వాహన పత్రాలు డ్రైవర్లు చూపించలేకపోయారని, ఆయా ట్రాక్టర్ల వివరాలను స్కానర్ ద్వారా పరిశీలించగా వాటి వివరాలు సక్రమంగా నమోదు కాలేదని, సంబంధిత సమాచారం అందుబాటులో లేదని గుర్తించబడిందన్నారు. దీంతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నందుకు ఆ మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఆయా డ్రైవర్లు, యజమానులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.





## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సిరికొండ, మే 16, ప్రభాతవార్త:**

ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సిరికొండ గ్రామానికి చెందిన సాయిని నర్సయ్యకు రూ.12,000, కాల్వ లక్ష్మికి రూ.7,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న, మాజీ ఉప సర్పంచ్ తోకల చందు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బియ్యల మల్లేష్, కాల్వ తరుణ్ యాదవ్ పాల్గొన్నారు.



## సొంత భవనం లేక పాలవాగు విద్యార్థుల విలవిల

**సిరికొండ, మే 16, ప్రభాతవార్త**

సిరికొండ పాలవాగు గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించి, నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు ఐటీడీఏ పీఓకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందోర్ మహేందర్, కుంటాగూడ సర్పంచ్ పాఠశాల దుస్థితిపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు కొత్త భవనం మంజూరైనప్పటికీ, అధికారుల నిరక్ష్యం వల్ల ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సొంత భవనం లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందుల నడుమ కోటంలోనే చదువు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు, వర్షాలకు విద్యార్థులు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో టాయిలెట్లు, కిచెన్ షెడ్, ఆట స్థలం వంటి కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థుల డ్రాపౌట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి

❋ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి






**నస్పూర్, మే 16, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు చేయుటకు కార్యాచరణ విడుదల చేసిందని, ఇందులో భాగంగా జూన్ 15 వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సంబంధిత సిబ్బందికి, అధికారులకు శిక్షణ, ఎన్యూమరేషన్ ఫారం ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జూన్ 25 వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, ఫారం పూర్తి చేసిన తర్వాత తిరిగి తీసుకోవడం జరుగుతుందని, జూలై 24వ తేదీ లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం జరుగుతుందని, జూలై 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కరణ, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మొదలయ్యే నాటికి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ సంబంధిత ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు వృద్ధ, అనారోగ్య, దివ్యాంగ ఓటర్ల నమోదు విషయంపై ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ఒకే కుటుంబం సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బందికి అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐపై అవగాహన సదస్సు

### - విద్యా వారోత్సవాల్లో భాగంగా కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక కార్యక్రమం

**బెల్లంపల్లి, మే 16, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో ఆరో రోజు సందర్భంగా శనివారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ) పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కాంపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ విద్యా వ్యవస్థలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏఐపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

### భవిష్యత్తులో ఏఐ కీలకం..

సదస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, విద్యా రంగంతో పాటు అన్ని రంగాల్లో కూడా ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించారు. తక్కువ సమయంలో అనేక పనులను చేయగలిగే సామర్థ్యం ఉన్న ఈ సాంకేతికతపై యువత ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





చెక్కులను అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## రూ. 16.49 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మే 16, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 81 మంది లబ్ధిదారులకు రూ. 16,49,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సహాయనిధి అమలు శాతాన్ని పెంచాలని, రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కన్నా ప్రభుత్వానికి ఏది ముఖ్యం కాదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలు నేరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిశ్చార్జ్ సమ్మరీ, ఎసెన్షియల్ సర్టిఫికెట్, ఎమర్జెన్సీ సర్టిఫికెట్, ఐపీ ఫైనల్ బిల్, ఎస్టిమేట్ కాపీలతో పాటు రోగి ఆధార్ కార్డ్, ఆన్‌లైన్ రేషన్ కార్డ్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సంప్రదించాలని కోరారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ నవీన్, సిబ్బంది

## మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

**భైంసా, మే 16, ప్రభాతవార్త:**

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ జీపీఏఐ పథకం ద్వారా మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కును దేగాం తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు శనివారం అందజేశారు. భైంసా మండల పరిధిలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ (49) బ్యాంకు ఖాతాతో పాటు ఈ బీమా పథకం తీసుకున్నారు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నామినీగా ఉన్న భార్య బొడిగంవార్ సుశీలకు రూ.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ నవీన్ మాట్లాడుతూ జీవితంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో ఎవరికీ తెలియదని, అలాంటి సమయంలో కుటుంబానికి అండగా నిలిచేది బీమా పథకాలేనని అన్నారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు బీమా చేయించుకుంటే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేగాం సర్పంచ్ సుష్మా రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామ్ రావు పటేల్, మాజీ ఎంపీటీసీ మాణిక్ రావు, శాఖ మేనేజర్ సోనియా, ఫీల్డ్ అధికారి ఉదయ్, విలాస్, సుధీర్, వార్డు సభ్యులు, ఐకేపీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది

**సారంగాపూర్, మే 16, ప్రభాతవార్త:**



మండలంలోని తాంద్ర. జి, వైకుంఠాపూర్ గ్రామాల్లో శనివారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మండల మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి పథకం ప్రారంభించిందన్నారు. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళలే వడ్ల కొనుగోలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్లలోనే వరి ధాన్యం, మక్కాలను అమ్ముకోవాలని సూచించారు. ఏ గ్రేడ్ క్వింటాల్ ధర రూ.2389, కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర రూ.2369 మద్దతు ధర ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరికి రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల వెన్నెల, కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సురేందర్, నాయకులు నరసయ్య, ఏపీఎం మాధురి, సీసీలు విగ్నేష్, భూమేష్, మార్కెట్ డైరెక్టర్ ప్రశాంత్, నాయకులు మధుకర్, రాహుల్, సూర్యం, కరుణాకర్, విఓ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో వికలాంగుల విభాగం ఏర్పాటు చేయాలి

**సారంగాపూర్, మే 16, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీలో వికలాంగుల విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని నిర్మల్ జిల్లా స్పందన వికలాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాక్‌పెల్లి సురేందర్ విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని తాంద్ర.జి గ్రామంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది వికలాంగులు అనేక సామాజిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర భారతావనిలో 79 ఏళ్లుగా రాజ్యాధికారానికి దూరమైన వికలాంగులకు రాజకీయ అవకాశాలు దక్కడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ బలోపేతంతో పాటు నిర్ణయాల్లోనూ వికలాంగులకు సరైన ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ త్వరలో చేపట్టబోయే నూతన కార్యవర్గంలో వికలాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.



## సిరికొండలో నిరుద్యోగులకు అవగాహన సదస్సు

**సిరికొండ, మే 16, ప్రభాతవార్త**

స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన చిలుకూరి గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాపై యువతకు అవగాహన కల్పించారు. సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాబ్ మేళాలో ఉద్యోగాల సాధనకు యువత ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో, ఎలాంటి అర్హతలు ఉండాలో క్షుణ్ణంగా వివరించారు. అనంతరం సర్పంచ్ బొడ్డు దత్తాత్రి మాట్లాడుతూ గ్రామాల్లోని నిరుద్యోగులను మోటివేట్ చేసి, జాబ్ మేళాలో పాల్గొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వస్తున్న ఈ గొప్ప అవకాశాన్ని సిరికొండ గ్రామ యువతీ యువకులు తప్పకుండా సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలి

**భైంసా, మే 16, ప్రభాతవార్త:**




తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు, సేవలను గుర్తించి వారికి తగిన గుర్తింపు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం పట్ల నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలను గౌరవించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కొట్టే శేఖర్, ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ కృష్ణంరాజు, గౌరవ అధ్యక్షుడు పాకాల రామచందర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తిస్తూ వారికి న్యాయం చేయాలనే దీర్ఘకాల డిమాండ్‌కు ఇది సానుకూల స్పందన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, సంబంధిత మంత్రివర్గ సభ్యులకు, కమిటీ చైర్మన్, సభ్యులకు నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరఫున ధన్యవాదాలు తెలిపారు. కమిటీ పారదర్శకంగా పనిచేసి నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి

### - మంచిర్యాల ఏసిపి ప్రకాష్

**దండేపల్లి, మే 16, ప్రభాతవార్త**

దండెపల్లి లోని వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మంచిర్యాల ఏసిపి ప్రకాష్ మిల్లర్లను సూచించారు. దండేపల్లి మండలంలోని లింగాపూర్ రైస్ మిల్లులను మంచిర్యాల ఎసిపి ప్రకాష్ సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యం నిలువచేసే గోదాముల వివరాలు ఏఈఓ రాజు, రైస్ మిల్ యజమానులతో మాట్లాడుతూ... వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంట వెంటనే మిల్లరు దింపుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో దాన్యం ఉండకుండా అధికారులు సైతం ధాన్యాన్ని లారీల్లో గాని ట్రాక్టర్లలో గాని రైస్ మిల్ కు గోదాములకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరం మేరకు గన్ని బ్యాగ్స్ టార్పాలిన్లు కూడా అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రం నిర్వాహకులకు అధికారులు తెలుపారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట సిఐ రమణ మూర్తి, దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ తోపాటు మిల్లర్, జిపిఓ స్వామి ఉన్నారు.



# పారిశుద్ధ్య నిర్వహణ ప్రతిఒక్కరి బాధ్యత

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**లక్షెట్టిపేట, మే 16, ప్రభాతవార్త**



పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో పారిశుద్ధం, రోడ్డు విస్తరణ పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రజలకు త్రాగునీరు, పారిశుద్ధం, అభివృద్ధి పనుల నిర్వహణపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని, వ్యాధుల నియంత్రణలో పరిశుభ్రత కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం హరహదారి విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని, అభివృద్ధి పనుల అనంతరం రహదారి ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ప్రజలతో మాట్లాడి వార్డులో నెలకొన్న సమస్యల వివరాలు తెలుసుకొని అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 6వ వార్డులో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాన్ని లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సంబంధించి రైతుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు వేగంగా తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల అధ్యక్షుల నియామకం నిలిపివేత: ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 16, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుల నియామక ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. శనివారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన జూమ్ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులను ఆడే గజేందర్ వారికి వివరించారు. దీనిపై స్పందించిన పీసీసీ అధ్యక్షుడు బోథ్ నియోజకవర్గంలోని మండల అధ్యక్షుల నియామక ప్రక్రియను ప్రస్తుతం నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారని గజేందర్ చెప్పారు. తదుపరి నిర్ణయం వెలువడే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా తొందరపడవద్దని ఆయన కోరారు.




ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## ఘనంగా డెంగ్యూ జాతీయ దినోత్సవం

**తాండూర్, మే 16, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు, నివారణ, డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సి హెచ్ఓ జయమేరీ, సూపర్వైజర్లు తార, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, లాబ్ టెక్నీషియన్ హకీమ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



## కనువిందు చేస్తున్న అరుదైన మే పుష్పాలు

### ఒకే మొక్కకు రెండు ఫుట్‌బాల్ లిల్లీలు వికసించడం విశేషం

**నస్పూర్, మే 16, ప్రభాతవార్త**

నస్పూర్ లోని టీఎన్జీవోస్ కాలనీ ప్రకృతిమిత్ర నిలయంలో అరుదైన మే పుష్పాలు వికసించాయి. సాధారణంగా సంవత్సరానికి ఒకసారి మాత్రమే పూసే ఈ మొక్కకు ఈ ఏడాది ఒకేసారి రెండు పుష్పాలు పూయడం చూపర్లను ఆకట్టుకుంటోంది. వేసవి కాలంలో మే నెలలోనే వికసించే ప్రత్యేకత ఉన్నందున వీటికి మే ఫ్లవర్స్ అని పేరు వచ్చింది. వాల్టా అథారిటీ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ కేరళ పర్యటనలో ఈ మొక్కను సేకరించి ఇక్కడ పెంచుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న తరుణంలో వికసించిన ఈ అరుదైన పూలను చూసేందుకు ప్రకృతి ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పుష్పానికి శాస్త్రీయ నామం స్క్యాడోక్సస్ మల్టీఫ్లోరస్. దీనిని సాధారణంగా ఫుట్‌బాల్ లిల్లీ, బ్లడ్ లిల్లీ అని కూడా పిలుస్తారు. ఈ పువ్వు గుండ్రని బంతిలా, ఫుట్‌బాల్ ఆకారంలో ఎరుపు రంగులో ఉంటుంది. చిన్న చిన్న పువ్వులన్నీ కలిసి ఒక పెద్ద గుత్తిలా మారి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప మొక్క. నేలలోని దుంప ద్వారా ఇది పెరుగుతుంది. ఏడాది పొడవునా కేవలం ఆకులతోనే ఉండే ఈ మొక్కకు వేసవి ప్రారంభంలో ఎలాంటి ఆకులు లేకుండా నేరుగా కాండం పైకి వచ్చి పువ్వు వికసిస్తుంది. ఈ పుష్పం జీవితకాలం కేవలం ఇరవై రోజులు మాత్రమే ఉంటుంది. చుట్టూ ఎండలు మండిపోతున్న సమయంలో కూడా నేలలోని తేమను ఉపయోగించుకుని వికసించడం ఈ పువ్వు ప్రత్యేకత. ఇవి సున్నితమైన సువాసనను వెదజల్లుతాయి. ఈ మొక్కలను ఆయుర్వేదంలో, సాంప్రదాయ వైద్యంలో కొన్ని రకాల చర్మ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. వీటి ఆకులను అలంకరణకు వాడుతారు. ఇటువంటి అరుదైన మొక్కలను ఇంట్లో పెంచడం వల్ల ఇంటికి అందంతో పాటు మానసిక ఆనందం, ప్రశాంతత లభిస్తాయని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. మానసిక ఉత్సాహాన్ని ఇచ్చే డోపమైన్, ఎండార్ఫిన్స్, సెరటోనిన్ వంటి హార్మోన్లు దీనివల్ల విడుదలవుతాయని తెలిపారు.

### కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు

# సరిపడా లారీలను కేటాయించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**నస్పూర్, మే 16, ప్రభాతవార్త**

ప్రభుత్వం రైతు సంక్షేమం కొరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపుకు సరిపడా లారీలను కేటాయించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లోగల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి వరి ధాన్యం తరలింపునకు లారీలను కేటాయించే గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి నిబంధనలకు అనుగుణంగా తాలు, తప్ప, ఎలాంటి మట్టి గడ్డలు లేని, నిర్దేశిత తేమ శాతంతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసి తరలించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం తరలింపుకు సరిపడా లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, లేని పక్షంలో సంబంధిత గుత్తేదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఐకెపి, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల వద్ద నుంచి నిబంధనలు మేరకు ఎఫ్ ఏ క్యూ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు తప్ప, తాలు, మట్టి గడ్డలు లేని ధాన్యాన్ని తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచిన ప్యాడి క్లీనర్లు, తేమ శాతం తెలిపే పరికరాలు, టార్పాలిన్లు, ఇతర పరికరాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## పదో తరగతి ఫెయిల్ అయిన పాత విద్యార్థులకు సువర్ణావకాశం

**- జూన్ 5 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు**

**- మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్**

**కాగజ్‌నగర్ రూరల్, మే 16, ప్రభాతవార్త :**

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన పాత విద్యార్థులకు ప్రభుత్వం మరో అరుదైన అవకాశాన్ని కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకార్ తెలిపారు. రాష్ట్రంలో సీసీఇ (నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానం అమల్లోకి వచ్చిన 2015 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఈ ఏడాది నిర్వహించనున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు తమ విద్యాభవిష్యత్తును కాపాడుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడే అవకాశమని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరుకావాలనుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్ష ఫీజులు, దరఖాస్తు చేసుకునే చివరి తేదీలు, అర్హతలు, పూర్తి మార్గదర్శకాలతో కూడిన అధికారిక ప్రకటనను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకుని తమ విద్యను కొనసాగించాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్



## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

**★ జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**దండేపల్లి, మే 16, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోనీ పలు గ్రామాల్లో రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని,ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య అన్నారు.శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం కన్నెపల్లి, గూడెం,నంబాల, వెల్గనూరు లలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే,మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. వడ్ల బస్తాలను సరైన రీతిలో నింపాలని, తూకం నిబంధనలు పాటించాలని, కేటాయించిన ప్రకారం గోదాములు,రైస్ మిల్లులకు తరలించాలని,గోని సంచులు, అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులకు అందించిన వరుస సంఖ్య ప్రకారం దాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం బస్తాల తరలింపు ప్రక్రియలో హమాలీలు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని తెలిపారు. ధాన్యం తరలింపు వేగవంతం చేసేందుకు తగినంత మంది హమాలీలను పనిలోకి తీసుకోవాలని, రోజుకు కనీసం 50 లారీలు తగ్గకుండా దండేపల్లి మండలంలోని వడ్ల కేంద్రాలకు పంపాలని గుత్తేదారుకు సూచించారు.ఈ వివిధ గ్రామ సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్స్,ఐకెపి ఎపిఎం,సంబంధిత అధికారులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## తిర్యానిలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి: తహసీల్దార్ శ్రీనివాస్**

**తిర్యాని, మే 16, ప్రభాతవార్త:**

తిర్యాని మండల కేంద్రంలోని గంభీరావ్‌పేట్ వ్యవసాయ గోదాం మార్కెట్ యార్డ్‌లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం నిల్వలు, తేమ శాతం పరీక్షించే యంత్రాలు, గన్ని బ్యాగుల లభ్యత వంటి అంశాలను పరిశీలించిన ఆయన, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తేమ శాతం నిబంధనల ప్రకారం ఉంటే వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కావాలనే కోతలు విధించడం, రోజుల తరబడి రైతులను వేచి ఉంచడం చేయవద్దని స్పష్టం చేశారు. వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలని, మిల్లర్లకు ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా తరలించాలని కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జీలకు ఆదేశించారు. దళారుల జోక్యం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. రైతులు కూడా ఎండబెట్టిన, చెత్తలేని నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వినయ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ జమ్మిడి కిష్టయ్య, ఉపసర్పంచ్ రాజకుమారి, సింగిల్ విండో చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఆసిఫాబాద్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ లత, ఏపీఎం శ్రీనివాస్, కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జ్ సీసీ శ్యామ్‌లాల్, గ్రామ సంఘం అధ్యక్షురాలు భూలక్ష్మి, వీఓ సభ్యులు జంగుబాయి, ఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి సుమిత్ర, సెర్ప్ సిబ్బంది సంతోష్ కుమార్, రాజేశ్వర్, కవిత, వీఓఏ రేగొండ సంతోష్, అకౌంటెంట్ రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్, ముత్తయ్య, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 16, ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో విద్యా వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కళలు, హస్త కళలు, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో విద్యా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కోలాటం, తోలుబొమ్మలాట, బొమ్మల ప్రదర్శన, పేరిణి శివతాండవం, ఒగ్గు కథ, లంబాడి/ఆదివాసి నృత్యం, చిత్రలేఖనం, హస్తకళలు వంటి అంశాలలో విద్యార్థులు ఆసక్తి కలిగి ఉండాలని, కళలతో పాటు క్రీడా రంగంలో రాణించాలని తెలిపారు. వివిధ రంగాలలో నైపుణ్యత సాధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని, టీం వర్క్ పై అవగాహన కలుగుతుందని తెలిపారు. ఏ రంగంలో అయినా గెలుపు, ఓటములు ముఖ్యం కాదని ప్రయత్నించడం మొదటి విజయమని తెలిపారు. వేసవిలో విద్యార్థుల కొరకు ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, వివిధ అంశాలలో విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య

## డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు విజయవంతం

**భైంసా, మే 16, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు విద్యార్థుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధునిక సాంకేతికతలో ఏఐ ప్రాధాన్యత, విద్యా రంగంలో దాని వినియోగం, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలు విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, వాక్చాతుర్యాన్ని పెంపొందించేందుకు దోహదపడ్డాయని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రవి కుమార్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ భీమారావు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం. శంకర్, డాక్టర్ ఓంప్రకాశ్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ నాహేదా, డాక్టర్ కల్పనతో పాటు అధ్యాపకులు దివ్య, రాజు, శ్రావణ్య, సురేందర్ పాల్గొన్నారు.

## బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సమావేశం

**బెల్లంపల్లి, మే 16, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు చేపట్టే దిశగా బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి నుండి మంచిర్యాల వరకు నడిచే ఆటో డ్రైవర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఖాకీ యూనిఫాం ధరించడంతో పాటు ఆటోపై టాప్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. కాంట చౌరస్తా నుండి ఓల్డ్ బస్టాండ్ వరకు రహదారిపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో, ఇరువైపులా ప్రయాణికులను ఎక్కించుకునే, దింపే సమయంలో మాత్రమే ఆటోలు ఆపాలని సూచించారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు, కార్లు, బైకులు అధికంగా రాకపోకలు సాగించడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డుపక్కన వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించాల్సి వస్తోందని, ఈ సందర్భంలో పోలీస్ జరిమానాలు విధించబడుతున్నాయని డ్రైవర్లు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ స్పందించి పట్టణంలో గతంలో ఉన్న ఆటో స్టాండ్లు తిరిగి ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డులకు చెందిన సుమారు 600 మంది ఆటో డ్రైవర్లకు సరైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ఆటోలు పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, స్థానిక ఆటో డ్రైవర్లకు అన్యాయం జరుగుతోందని సమావేశంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో స్థానిక కౌన్సిలర్ల సహకారంతో కాంట చౌరస్తా నుండి ఓల్డ్ బస్టాండ్ వరకు ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలా చేయని పక్షంలో ఆటోలను కాంట చౌరస్తా వరకే పరిమితం చేసి అక్కడే ఆటో స్టాండ్ ఏర్పాటు చేస్తామని డ్రైవర్లు హెచ్చరించారు. పట్టణ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ఆసిఫాబాద్, మే 16, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో చేపట్టిన విద్యా వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖగకళా నైపుణ్య, సాంస్కృతిక దినోత్సవంగగ (కళాయవనిక) కార్యక్రమానికి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టి సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యతో పాటు నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం, క్రీడలు వ్యక్తిగత విజయానికి పునాదులని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక రంగాలలో రాణించాలని, సామాజిక సేవ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా చేస్తున్న విద్యా బోధనతో ప్రభుత్వ పాఠశాలలలో ఫలితాలు అద్భుతంగా వస్తున్నాయని, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల హస్తకళలు, చిత్రలేఖనాలు, సాంస్కృతిక ప్రదర్శనలను అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న బస్తాల కోసం గోదాముల ఏర్పాటు

**సారంగాపూర్, మే 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం తూకం వేసిన బస్తాల నిల్వ కోసం మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, మార్కెట్ సిబ్బంది గోదాములను సిద్ధం చేశారు. సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్, మలక్ చించోలి, బీరవెల్లి ప్రాంతాలలో ఈ గోదాములను ఏర్పాటు చేశారు. రైతుల ఇబ్బందులను తొలగించే దిశగా, సారంగాపూర్ మండలంలో మొక్కజొన్న బస్తాల నిల్వ కోసం ప్రత్యేక గోదాములను అందుబాటులోకి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు. దీనివల్ల రైతులు తమ పంటను సురక్షితంగా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. ఈ గోదాముల పరిశీలన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్‌తో పాటు తహసీల్దార్ విజయకాంత్ రావు, ఆలూర్ సొసైటీ సీఈవో సుకుమార్, గోదాం ఇంచార్జీలు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గోదాములను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, తహసీల్దార్ విజయకాంత్ రావు

## పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ మహమ్మారిని తరిమికొట్టవచ్చు

### - మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్



**నస్పూర్, మే 16, ప్రభాతవార్త**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమల నివారణ సాధ్యమవుతుందని, తద్వారా డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల లార్వా ఉత్పత్తిని అరికట్టడం ద్వారానే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించగలమని స్పష్టం చేశారు. వైద్యారోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు కాలనీల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేల్పుల రవీందర్, 8వ డివిజన్ కార్పొరేటర్ మేకల రాము, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, స్థానిక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆన్లైన్ సెమినార్

**కాగజ్‌నగర్ రూరల్ ,మే 16, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న విద్యావారోత్సవాలను పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఐ.క్యూ.ఎ.సి విభాగం ఆధ్వర్యంలో శనివారం ఖగఎ.ఐ పవర్డ్ లెర్నింగ్, ది ఫ్యూచర్ ఆఫ్ స్మార్ట్ ఎడ్యుకేషన్గగ అనే అంశంపై అన్ లైన్ సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సెమినార్ లో ముఖ్య వక్తగా ఎస్.ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం.కార్తిక్ రెడ్డి పాల్గొని భవిష్యత్ విద్యారంగంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని కాని అది ఉపాధ్యాయుల స్థానాన్ని భర్తీ చేయబోదని పేర్కొన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం మాత్రం అందరు అందిపుచ్చుకోక తప్పని పేర్కొన్నారు. స్మార్ట్ ఎడ్యుకేషన్ అంశానికి సంబంధించి డా.కార్తీక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతు కృత్రిమ మేధ ప్రస్తుతం అన్ని రంగాలలోకి వేగంగా విస్తరిస్తుందని తెలియ జేశారు. కళాశాల ఐ.క్యు.ఎ.సి కోఆర్డినేటర్ డా.ఇ.శారద మాట్లాడుతు భవిష్యత్తులో కృత్రిమ మేధ మన నిత్యజీవితంలో భాగం కానుందని కాబట్టి ప్రతీ ఒక్కరు ఆ దిశగా పరిజ్ఞానం పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అనంతరం ఎ.ఐ కి సంబంధించి విద్యార్థులు అడిగిన వివిధ సందేహాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ కార్తీక్ రెడ్డి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మినరసింహం, అకడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్ అధ్యాపకులు ఎం.రాజేశ్వర్ డా.వి.దేవేందర్ రెడ్డి, రోజ్ మేరి, వెంకటేశం, కృష్ణవేణి, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

